*మొగుడ్ని చూచి గర్వించలేని ఆడది కొడుకుని చూసుకొని పొంగిపోక ఏం చేస్తుంది? పరానికి బ్రహ్మవిద్య ఎలాగో ఇహానికి హేమవిద్య అలాటిదని చెప్పిన అధునాతన సావిత్రి జులాయి భర్తను తిరస్కరించక ఏం చేస్తుంది?*

# విలువ

కనకవల్లి



"ఏమిటీ? వీడు రాత్రి కూడా రాలేదా ఇంటికి?" వంటయింటి గూట్లోవున్న పండ్లపొడి చేతిలో వేసుకుంటూ అడిగింది భ్రమరాంబ కోడల్ని. కాఫీ కుంపటి ముందున్న కాత్యాయని తలతిప్పి ఆమె వైపు చూడకుండానే 'ఉహు' అన్నది ముభావంగా. ఆమె కసలే చిరాగ్గా వున్నది. మనసుడికి పోతుంటే ఈ అత్తగారి వ్యంగ్యోక్తులొకటి. రోజూ జరిగే భాగోతానికి ప్రశ్నలూ, జవాబులెందుకూ? తెలియదూ తనకు? చెట్టంత మనిషి ఇంటికొస్తే కనబడక నలుసా, నల్లపూసా, దాచిపెట్టడానికి? చమత్కారం గాకపోతే?

"రాడు. ఎందుకొస్తాడు? అంతలో వుంది మన తెలివి. చిలక్కు చెప్పినట్టు చెప్తున్నా - చెప్పిచెప్పి నానోరు నొప్పేగాని లాభముంటేగా? ముగ్గులూ మూగిమొద్దులూ కాకుంటే దమ్మిడీ కట్నంవద్దని మేనకోడలివని నిన్ను చేసుకుందెందుకంట? వాడు కాస్త పెడసరంగా తయారయినాడు అదుపులో పెట్టగలిగిన కోడలైతే బాగుండునని గదూ? నీ తెలివి ఇట్లావుంది.. మూసిన ముత్యం. పాసిన పగడం! ఉలకదు పలకదు"

మాట్లాడకుండా డికాషనుదించి. పాలగిన్నె పడేసింది కాత్యాయని. ఏంచెయ్యమంటుందీ అత్తగారు? మొగుణ్నెక్కడికీ పోకుండా కట్టెయ్యమంటుందా? లేక రెండు తన్నమంటుందా? అవిరెండూ తనవల్ల అయ్యే పనులుకాదు. పోనీ యింత ప్రేమగా పెంచిన తల్లి తానే పూనుకోకూడదు మరి!

కోడలు కాఫీ కలిపేసరికి భ్రమరాంబ మొహంకడుక్కొని వచ్చి పీటమీద కూర్చుంది. "వెధవ కాఫీ చల్లారితే సయించవు. మళ్ళీ వెచ్చబెడితే బాగుండవు. అందుకని ఆ వేడి కాఫీకోసం ఇంత ఆరాటం ఏమిటో పాడుజన్మలు! పోయేటప్పుడెట్లాగో గానీ వుండగా ఇన్ని రుచులు"! వేదాంత ధోరణిలో అర్ధస్వగతం పలుకుతూ, కాఫీ తాగి లేచింది భ్రమరాంబ.

ఆమె వెళ్ళగానే మామగారు వచ్చారు. "ఏమిటమ్మా అంటూంది అత్తగారు? మళ్ళీ సుప్రభాతమేనా?" కాత్యాయని ఏమీ అనకుండా నవ్వి మామగారికి కాఫీ అందించింది.

"చిలక్కు చెప్పినట్టు చెప్పా మొదట్నే. పిల్లల్లేరు. లేకుంటే ఏంపోయె? వున్నన్నాళ్ళూ తిందామే. హాయిగా వుందామే. ఎందుకీ జంజాటాలన్నీ. తర్వాత సంగతి తర్వాతే అని ఎన్నివిధాల చెప్పినా విన్నదా? దత్తో సత్తో అని ఎగిరింది. సరే తెచ్చుకున్న మనిషి వాడ్ని కాస్త అదుపూ, ఆజ్ఞగా పెంచుకోవద్దూ? వాడ్ని అచ్చుబోసి వదిలేసింది. ఆడిందాట పాడిందిపాట! వాడేం దారికొస్తాడు? అసలు వాడు చెడిపోవటానికి కారణం మీ అత్తగారే. ఇప్పుడంటే ఏడుస్తుంది. వాడు నాకేం పరాయివాడా? స్వంత తమ్ముడి కొడుకు- గిట్టక అంటున్నాననుకోవటానికి. ఆఁ - బుద్ధి తెలిస్తే వాడే

బాగుంటాడు. చిన్నప్పుడంతా యింతే నన్నది. బాగుపడటం కనబడుతుంద్లే? మధ్య నీమీద యుద్ధమెందుకూ రోజూ?" కాఫీ తాగుతూనే మామగారు ఉపన్యాస మిస్తున్నారు.

"ఏమిటా ఉపన్యాసం? నా మీదేనా? నేనొక దాన్ని తేరగా దొరుకుతాను మీకు. తీరి కూర్చుని గీతోపదేశం చేస్తున్నారు పాపం!"

"నిగ్రహానుగ్రహ సమర్థురాలివి. శ్రీకృష్ణుడంతదానివి నీవు చెయ్యాలి గాని నావల్లేమవుతుందే గీతోపదేశం చెయ్యను."

"ఆ నా సమర్థత మండింది- మీ అమాయకత్వం అడుక్కుతిన్నది. కనబడుతుంద్లే నా సమర్థతా. మీ చేతగానితనమూ?"

ఆయన ఇకనేమీ అనకుండా వీధిలోకి నడిచాడు. "చస్తున్నా ఈయనతో. రిటైరైంతర్వాత మరీ నస మొదలైంది. నావల్లగాదిక వేగటం."

కాత్యాయని పలక్కుండా స్నానం చేసి మడికట్టుకుని పొయి దగ్గరకు వెళ్ళింది. శ్యామసుందర్రావు ఉరుకులు పరుగులతో వచ్చి, అమ్మా! స్నానానికి నీళ్ళున్నాయా? అర్జంటు. ఎక్కడా? అమ్మెక్కడా? బొమ్మవు నీవు చేరావు పొయి దగ్గరకు ఇవాళ?" అన్నాడు.

కాత్యాయనికి వళ్ళుమండింది. రోజూ తానేగా యింటెడు పనీ చెయ్యటం ఇవాళ పొయిదగ్గరున్నావేం అని ప్రశ్న?

"పొయిదగ్గరివాళేం? ఇంటి కోడల్నయినదగ్గర్నుంచి నాస్థానమిదేగా? పాపం ఎప్పుడూ చూసినట్టుండలేదేమో మీరు!"

"ఓహ్! అంతలో కోపమొచ్చిందా? పిలవకుండానే పలుకుతుందికదే చిలకా నీకు కోపం!" అంటూ బాత్‌రూమ్‌లోకి దూరాడు.

కొడుకు వెళ్ళగానే భ్రమరాంబ వచ్చింది లోపలకు "అంతలో వుందితెలివి- వాడేదో అడుగుతుంటే అదేమిటో కనుక్కోక? ఏమిటా కట్టె విరిచినట్లు మాట్లాడటం? అట్లాగేనటేమగవాడితోమాట్లాడేది?ఎప్పుడు నీకింకా జ్ఞానం కలిగేదీ?"

కాత్యాయని గిరుక్కున అత్తవైపు తిరిగి "సరే. పొయ్యిమీద పప్పుపడేశా. మాడుతుందేమో కాస్త చూడు. ఆయన పనేమిటో కనుక్కుని వస్తా నేను."

భ్రమరాంబ తెల్లబోయి ఏదో అనేందుకు నోరు తెరిచేంతలో కాత్యాయని బాత్రూం లోకి వెళ్ళింది. లోపల భర్తలేడు. తువ్వాల చుట్టుకుని బావిదగ్గర నిల్చుని వున్నాడు. కాత్యాయని వస్తూనే "నీళ్ళు నేను తోడిస్తానుండండి." అంటూంటే. అతనాశ్చర్యంగా కనుబొమలు పైకెత్తి-

"అరె! ఏమీచిత్రం? పడమటి వైపు చూచిరా. సూర్యుడేమైనా...."

బకెట్టు నీళ్ళలో ముంచుతూ "అక్కర్లేదు. ఆయనకేం పిచ్చెక్కలేదు పడమట ఉదయించడానికి. మీరు ముందు స్నానం చెయ్యండి. తర్వాత చూద్దాం."

"అదిగాదే అమ్మాయ్! నేనింకా స్నానమూ చెయ్యలా. మడీ కట్టుకోలా? ఆ పప్పు పొయిమీద పడేసి వస్తివే. మాడి చావదూ?"

"వెళ్ళు వెళ్ళు. నీళ్ళు నేను తోడుకుంటాలే. రోజూ మహా నీవే తోడిపోసినట్టు!" శ్యామసుందర్రావ్ బకెట్టు అందుకోబోయినాడు.

"ఉండండి. తాకవద్దు." అంటూ బకెట్టు తీసి కిందపడేసి విసురుగా లోపలకు వెళ్ళింది కాత్యాయని.

"ఏం పిల్లో. ఏం లోకమో? కస్సుబుస్సే తప్ప మామూలు మాటే లేకపాయె. మాట అంటేసరి." భ్రమరాంబ వగచింది.

"ఇవాళ కొత్తా ఏం? అందుకే నేను మొదటే అన్నా. నీవేగా మీ అన్నయ్య పిల్లని మురిసి చేశావు? ఇప్పుడెందుకు?"

"అయ్యోకర్మ! ఇంత కొరివౌతుందనుకోలేదురా తండ్రీ! చిట్లకొరివై కూచుందెక్కడో ముదనష్టపుది."

కోడలు వింటుందేమోనని నోరు నొక్కుకుంటూ మెల్లగా కొడుకుతో గుసగుసలాడింది భ్రమరాంబ. కాత్యాయని ఇవి వినసే విన్నది. ఈ అత్తవాలకం కొత్తదేం గాదామెకు. పుట్టినప్పట్నుంచీ ఎరిగినదే. పెండ్లికాక ముందు మేనత్త - అయింతర్వాత అసలత్త. అంతే భేదం. ఇన్ని మాటలనే అత్త. కొడుకు రాత్రింటికి రాలేదేమని అడుగుతుందేమో చూడు? కాత్యాయని కోపం గిన్నెలమీద చూపించింది. పళ్ళెం కిందపడి అరగంట సేపు మొత్తుకున్నది.

"ఏమిటే అది అమ్మాయ్? ఏమిటా గందరగోళం?" భ్రమరాంబ లోపలికొచ్చింది.

"జిడ్డుచెయ్యి జారిపడింది. కావలసి పడేశానా ఏం?" కోడలుగొణిగింది. ఏమీఅనలేక ఊరుకోలేక భ్రమరాంబేదోగొణుక్కుంటూ ఆవతలకి వెళ్ళింది. స్నానంముగించి శ్యామసుందర్రావు వచ్చాడు.

"అయిందా వంట ఆలస్యమేమయినా వుందా?" కాత్యాయని పీట వాల్చింది. "వదిలిందాఅమ్మ? మంత్రాంగమింకా వుందా?" అతను తలెత్తి సూటిగా చూశాడు "పర్వాలేదే! మాటలు జోరుగానే వున్నాయి".

కాత్యాయని మూతిబిగించింది. "ధన్యులాల్ని రసికాగ్రేశ్వరులు మీరు మెచ్చుకుంటే నా జన్మ తరించినట్లేయిక"!


క్రాఫ్ట్‌ఆర్ట్స్ గ్రీటింగ్‌కార్డులు



సంక్రాంతి సెట్లు



| గిఫ్ట్ ప్యాకెట్‌లు | తపాలాకాకట పోస్టేజితో చొప్పున వహా ధర | |
|---|---|---|
| 1 సంక్రాంతి లక్ష్మి సెట్ | 6 కార్డులు | 10.50 |
| 2 మహిళల సెట్ | 9 కార్డులు | 11.25 |
| 3 యువతుల సెట్ | 9 కార్డులు | 9.25 |
| 4 సంక్రాంతి ఎసార్టెడ్ | 9 కార్డులు | 6.75 |

గిఫ్ట్ బాక్స్‌లు (ఎక్స్‌పోర్టు క్వాలిటీ కార్డులు)

| | | |
|---|---|---|
| 1 సంక్రాంతి ప్రెజెంటేషన్ సెట్ | 12 కార్డులు | 20.01 |
| 2 సంక్రాంతి ఎసార్టెడ్ ప్రెజెంటేషన్ సెట్ | 15 కార్డులు | 20.00 |

**Cards Crafts Classics**

13/1, General Patters Road
Post Box No. 2421
MADRAS-600 002, INDIA
Grams: "CARDCRAFTS"
Telephones : 812208 & 83793

ఉచితం ఉచితం ఉచితం

తెల్ల మచ్చలు

ఏ రకం తెల్లమచ్చలైనాసరే వాని రంగు మరియు ఎర్రమచ్చల రంగు మా ప్రఖ్యాత ఔషదం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మమువలె నుండి పోవును. ప్రచారం కొరకు 1 సీసా మందు ఉచితముగా పంపెదము. వెంటనే వ్రాయండి.

JIWAN KALYAN ASHRAM-12
P. O. KATRI SARAI (GAYA)

డా॥ పి.వి.కె.రావ్, B.A., సెక్స్‌స్పెషలిస్ట్



వైద్యవిద్వాన్ – వైద్యాచార్య. హస్తప్రయోగం, వరముల బలహీనత, అంగముచిన్నద గుట, శీఘ్రస్ఖలనము-శుక్ల నష్టము. సుఖ రోగములకు మానసిక వ్యాధులకు ఆయుర్వేద చికిత్స. పోస్టుద్వారా కూడా చికిత్స గలదు.

రావున్ క్లినిక్

టి. బి. రోడ్, తెనాలి, ఫోన్ : 700

SUVARNA

మృదు మధుర మనోజ్ఞమైన పరిమళానికి

తప్పక వాడండి




ఆంధ్రదేశమంతటా ఏజెంట్లు కావలెను.

DOLMAN PERFUMERY WORKS.
10/2, B. V. NAIDU STREET, MADRAS-1.

శ్యామసుందర్రావు మాటమారుస్తూ "మాటలేనా కాచమ్మా? వడ్డించేదేమైనా వుందా?"

కాత్యాయనికి చర్రుమంది. "లక్ష సార్లు చెప్పానట్లా పిలవ్వద్దని. నిషేపంలాటి పేరుండగా కావమ్మేమిటి. కూచమ్మేమిటి?"

అతను నవ్వుతూ "పోనీ బూచమ్మా అని పిలిస్తే బాగుంటుందా?" కాత్యాయని బిగించిన పెదవుల చివర్ల నవ్వు తొంగి చూసింది. ఏదో అనబోతూ తలెత్తి చూచి మాటలు దిగమింగింది.

అదేమిటే అమ్మాయ్: వాడు టయిమయిందని త్వరపడుతుంటే వడ్డించవేం? మళ్ళీ ఆదరాబాదరా తినీతినకా పరుగెత్తుతాడు."

కాత్యాయని మనసులోనే పండ్లు కొరుక్కున్నది. నీవున్నావుగా ప్రేమగల తల్లివి. గోరు ముద్దలు చేసి నోటి కందిస్తువుగానిలే.

భ్రమరాంబ తలుపు కానుకుని కూచుని కొడుకుతో సంభాషణఆరంభించింది. కాత్యాయని నోరెత్తకుండా వడ్డించింది. కొడుకు భోజనం ముగిసే వరకూ భ్రమరాంబ అక్కడ్నుంచి కదల్లేదు. విసుగుపుట్టిన కాత్యాయని మజ్జిగ గిన్నె భర్త దగ్గరుంచి వెళ్ళిపోయింది. చెయి కడుక్కుని శ్యామసుందర్రావు మేడెక్కాడు అత్తగారి కన్ను గప్పి కాత్యాయని అనుసరించింది.

"తలకు నూనె వ్రాయమంటారా?" శ్యామసుందర్రావు తిరిగి చూశాడు.

"ఏమిటో ఇవాళంతా చోద్యమే ననిపిస్తున్నది.!"

"ఏమిటంత విడ్డూరం?" కాత్యాయని కళ్ళెత్తకుండానే అడిగింది .అతను జవాబివ్వకుండానే "ఏమిటసలు విశేషం?"


"అమ్మాయ్ మైల; తాకకు మీమామయ్య వచ్చారు భోజనానికి" భ్రమరాంబ లోపలకు వస్తూనే అంటూ, అంతలో "నీవింకా వున్నావా నాయనా? ఆఫీసు వేళ కాలేదూ?" అన్నది అప్పుడే కొడుకుని చూసినట్టు నటిస్తూ.

కాత్యాయని పలక్కుండా గడప దాటింది. మామ భోజనానికి వస్తే తానెందుకు? వాళ్ళిద్దరూ కూర్చుని హాయిగాతినరాదు? తానేం చేస్తున్నదో ఇన్‌స్పెక్షన్ కాకుంటే!

శ్యామసుందర్రావు తలదువ్వుకుంటుంటే భ్రమరాంబ ప్రేమగా "ఆఫీసు వేళయ్యిందయ్యా-ఏమైనా డబ్బుకావాలా"?

"అక్కర్లేదమ్మా కావాలంటే అడుగుతానులే" అన్నాడు.

గోడవక్కన విల్చుని వింటున్న కాత్యాయని పండ్లు కొరుక్కుంది కసిగా. డబ్బు కావాలా అట. ఎంత ప్రేమ ఎంత ప్రేమ



సంక్రాంతి ముగ్గు

చిత్రం : కె.తేజస్‌కుమారి, రాజమండ్రి

పాపం; అసలీమెవల్ల కదూ ఆయనింత చెడిపోయింది? కాకుంటే నెలజీతం ఇంట్లో దమ్మిడీ ఇవ్వరు. అంతా ఖర్చుచేస్తారు! అదేమైందని అడగదట్లావుంచి ఇంకా పైన కావాలా అని అడుగుతుందేమిటీవిడ? బి. ఎ. ఫస్ట్ క్లాస్‌లో ప్యాసై. శుభ్రంగా వుద్యోగం చేస్తున్న శ్యామ్ సుందరర్రావేం తెలివి తక్కువవాడా? ఈమె కావాలనే అతన్ని చెడగొడ్తున్నది. ఒకవైపు కొడుకునిట్లా తయారుచేస్తూనే మరొకవైపు తనను దండిస్తుంటుంది. భర్తను దారికి తీసుకు రావటం లేదని. ఎంత చమత్కారమున్నదో మనిషికి? పరాయి సంబంధమైతే తన ఆటలు సాగవని లెనిపోని ప్రేమలు ఒలకబోసి తనను ముడిపెట్టుకున్నదిందుకే. అందరి దృష్టిలో దమ్మిడీ కట్నం లేకుండా మేనగోడల్ని చేసుకున్నానని పేరు. పిర్రగిల్లి జోలపాడే రకం మనిషంటే ఇట్లాంటిదే!

* * *

మధ్యాహ్నం మంచివానపడి వెలిసింది. వానకు తడిసిన చెట్ల ఆకుల మీద ఎండపడి తమాషాగా మెరుస్తున్నది. వాతావరణం చల్లగా హాయిగా వున్నది. రాత్రి వంట చాలా త్వరగా ముగించి పళ్ళెంలో మల్లెపూలు పోసుకుని కూచున్నది కాత్యాయని. భ్రమరాంబ కోడలివైపు అనుమానంగా చూచింది.

"పెందలాడే వంట ముగించావు. ఎక్కడికైనా వెళ్ళే ప్రోగ్రాముందా ఏం?" అన్నది. కాత్యాయని మనసులో 'నీవు బతికుండగా నే నెక్కడికి వెళ్తాను? ఏట్లోకి తప్ప' అనుకున్నా పైకి, "అవునత్తా. సినిమాకు వెళ్దామనుకున్నాం పొద్దున" అన్నది.

కొడుకు ఆఫీసునుండి వచ్చేసరికి భ్రమరాంబకు తలపోటూ, వళ్ళునొప్పులూ చలీ

వచ్చాయి. పర్వాలేద్లే. వళ్ళు చల్లగానే వున్నది." అన్నాడు మామగారు.

"కండ్లు మంటలూ, వళ్ళు నొప్పులూ తల పగిలిపోతున్నది. జ్వరం రావచ్చు తగ్గేసరికి" అన్నది భార్య మూల్గుతూ.

'ఎందుకురాదూ? సినిమావేళ్టికి జ్వరమూ వస్తుంది. మేం వెళ్ళామంటే అది టైఫాయిడ్‌లోకి దించుతుంది' అనుకున్నది కోడలు మనసులో.

ఆఫీసునుండి వచ్చిన శ్యామసుందర్రావు ఇదేమీ తెలియక ఆశ్చర్యపడ్డాడు. "ఇదేమిటమ్మా? పొద్దున బాగానే వున్నావుగా?"

"ఏమిటోరా మాయగా వున్నది. మధ్యాహ్నం వరకూ బాగానే వున్నాను." కాత్యాయనికి నవ్వొచ్చింది. 'మాయమనిషికి మాయరోగం'

సినిమావేళదాటిపోయినా కొడుకు కోడలు తయారు గాకపోవటం చూసి భ్రమరాంబకు ఆశ్చర్యం వేసింది. తనను ఆట పట్టించను అబద్ధంచెప్పి నట్లుంది, పెడసరిపిల్ల. ఔరా. హాస్యం ఆడతారా భ్రమరాంబ కోడలి తెలివికి నిర్ఘాంతపోయింది.

"జ్వరం తగిలిందిగామాలు! అన్నమేం తింటావింక రాత్రికి?కాఫీ పెట్టివ్వనా అత్తా" అంది. కాత్యాయని మాటలకు వళ్ళు మండి "ఆఁ నాకు జ్వరమూలేదు ఏంలేదు. వేడి చేసింది. మధ్యాహ్నం వాన కురిసేటప్పటికి కాస్త చలి అన్పించింది అంతే. ఇప్పుడు కాస్త తేలిగ్గానే వుంది వంట్లో. కాస్త అన్నమే తింటా లేకుంటే మరీవేడిచెయ్యదూ? తెల్లవారి లేవగలనా? నీరసం ముంచుకురాదూ?"

* * *

అందరి భోజనాలు ముగిసి, వంటిల్లు సర్దుకుని, తాంబూలం పళ్ళెం తీసుకుని, గదిలో అడుగుబెట్టిన కాత్యాయని నిర్ఘాంతపోయింది, శ్యామసుందర్రావా రాత్రివేళ డ్రస్సవుతున్నాడు. సూటూబూటూవేశాడు. కోటింకా కుర్చీకే వేళ్ళాడున్నది. తలనొక దారికి తేవాలని తంటాలు పడుతున్నాడతను.

కాత్యాయని సాలభంజికలా అట్లాగే నిల్చుని చూడసాగింది రెప్పవాల్చకుండా. అర్ధరాత్రి ఎక్కడికో ప్రయాణం? ఎందుకో అంత షోకు?

శ్యామసుందర్రావసలే చక్కనివాడు-పైగా షోకుగాడు మరీ మరీ చెక్కుతున్నాడు జుట్టును. పెండ్లిలో అందరూ మెచ్చుకున్నారు. తమ జంటనుచూసి రతీ, మన్మధులన్నారు కూడాను. పెళ్ళయి తొమ్మిదేళ్ళయింది.తొమ్మిదినెలలయినా అతను యింటి పట్టునుండలేదు.. అత్తగారు అదేనునదు-పైగా కొడుకునువెనేకేసుకొస్తుంది.మామగా

6 నెలల నుంచీ మీరు చదువుతున్నారా?

"ప్రజా సాహితి" (సాహిత్య మాసపత్రిక)

ఎడిటర్ : రంగనాయకమ్మ

1978 జనవరి సంచికలో—

* డాక్టర్ కోవూర్ ప్రసంగం * "స్పార్టకస్" పుస్తక పరిచయం :రంగనాయకమ్మ * ఉద్యోగపుటుద్ది (నిన్నటి కథ) : కవికొండల * కడుపు కక్కుర్తి (అనువాద కథ) : చైనీస్ మూలం * మీటింగ్ పెళ్ళి (కథ) : రంగనాయకమ్మ * తుపాను గురించి —ఒక జర్నలిస్టు చూసింది *రేడియో కార్యక్రమాలు * చర్చావేదిక * పుస్తక సమీక్ష * సినిమా సమీక్షలు * కవితలు.

● ప్రతులకు : మేనేజర్, ప్రజా సాహితి,

అరుణా పబ్లిషింగ్ హౌస్,

ఏలూరు రోడ్, విజయవాడ-520 002.

ఐటెక్స్ - మాట్ ఫినిష్ తిలకము

నాణ్యతను పరిశోధించి వ్యత్యాసమును చూడండి

ఐటెక్స్ మాట్ ఫినిష్ (EYETEX MATT FINISH) తిలకము మీ మృదువైన చర్మమునకు సరియైనది. మీ అందమును ప్రజ్వలింపజేయును. అనేకమైన మంచి రంగులలో, చర్మమునకు హాని కలగని మంచి సువాసన ద్రవ్యములతో జేయబడినది.

ఇది ఔషధములు మరియు అలంకార వస్తువుల యాక్ట్ మరియు రూల్స్ ప్రకారము - విజ్ఞాన పూర్వకముగా తయారుచేయబడినది.


ఒక్కొక్క ట్యూబులోను 50% ఎక్కువ తిలకము అదే ధరకు దొరుకుటచే చాల సొదుపైనది.




EYETEX REGD.

33 సంవత్సరముల అనుభవము వేరు విధముగ వుండుటకు వీలులేదు.

ARAVIND LABORATORIES MADRAS-600 033



రదోరకం మనిషి. నిజానికి యివన్నీ ఆయనకు గిట్టవు. అయినా భార్యనుగాని, కొడుకుని గాని మందలించరు.

"హే తాంబూల కరండవాహికా! ఏమ చేటే శిలవై పోతివీ? లోపలకు రారాదో కప్పురవిడెమీరాదో!" తల దువ్వుకుంటూనే శ్యామసుందర్రావు అద్దంలో చూస్తూ పిలిచాడు. కాత్యాయని లోపలికివచ్చి బల్ల మీద పళ్ళెముంచి, చిలకలు చుడుతూ,

"వేషమద్భుతంగా కుదిరింది ఇక తెర వెడలవచ్చు రాజుగారు.!"

"నిజంగానా? మరి గుగ్గిలమేసే వారెవరే కాచమ్మా?" అంటూ దువ్వెన బల్లమీద పడేసి, కాత్యాయని పైట చెంగందుకుని చేతులు తుడుచుకున్నాడతను.

ఆమె మొహం చిట్లించి "ఛీ ఆ నూనె చేతులు తుడవకండి చీర పాడవుతుంది. కిందకు వెళ్ళరాదూ మీ అమ్మకప్పుడే నిద్ర పడుతుందా ఏం? ధూపంవేస్తుంది లెండి.

"నీ సలహాకు థాంక్స్. తే తాంబూలం వెళ్తాను."

కాత్యాయని మొహం గంభీరంగా చేసుకొంది. "చాలించండి వేషాలు ఎక్కడికి అర్ధరాత్రి ప్రయాణం?"

"ఏళ్ళొచ్చాయి ఎందుకు? అట్లాఅడగ్గూడదని జ్ఞానం లేకపోయిన తర్వాత. ఏం మనిషివి?"

"మరమనిషి లెండి. నేనడగగానే మీ పెండ్లి ప్రయత్నాలేం ఆగిపోవుగాని. మీరిప్పుడు ఇల్లు కదలను వీల్లేదు. తెలిసిందా?"

"అదేమిటా తిక్క? నా కవతల అర్జంటు పనుంది." కోటందుకున్నా డతను. కాత్యాయని మొండిగా వెళ్ళి తలుపు గడియ పెట్టింది.

"అర్జంటు పని రేపొద్దున అర్జంటుగా చేస్తురులెండి. ఈ రాత్రి పూట వెళ్ళక్కర్లేదు. ఈ గదిలో వంటరిగా వుండాలంటే చచ్చేభయం నాకు. అందులో వాన కురుస్తుందా మరీ భయం."

"వాన కురుస్తుంటే మరీ భయమా? అదేమిటా చమత్కారం?"

"కాదామరి? వానకు గాలికి కిటికీ రెక్కలు గబగబా బాదుకుంటుంటాయి. నాగుండెలు గుబగుబ లాడ్తాయి."

శ్యామసుందర్రావు సూటిగా చూశాడు. కాత్యాయని కొంటెగా చూసింది. "బాగుంది సరసం." అన్నాడతను మూతి బిగించి.

"అప్పుడేనా మెప్పు? ఇప్పుడేగా ప్రారంభమైంది?" మళ్ళీ యిద్దరి కండ్లూ కలుసుకున్నాయి. కాత్యాయని తలనిండావున్న మల్లెపువ్వులు విచ్చి గదంతా గుమ్మమంటున్నది. మౌనంగాలేచి తలుపువైపు అతను రావటంచూచి. ఆమె లైటు ఆర్పింది. తలుపు గడియ తియ్యను చెయి జాపిన శ్యామసుందర్రావు చేతికి కాత్యాయని భుజం దొరికింది. మర్నాటి సూర్యోదయం తన యింట్లోనే అయిందతనికి.

* * *

తెల్లవారింది మొదలు భ్రమరాంబ రుసరుస లాడ్తూనే వున్నది. దేనికో దానికి నసనస మంటూనే వున్నది. కాఫీకి పొద్దెక్కిందన్నది.

"అయినా ఇవేం బద్ధకాలు. ఇవేం వేషాలు? అయినింటి ఆడకూతురు చీకటుండగాలేచి. పనిపాటలు చక్కదిద్దుకోవాలిగానీ. దొరసానిలా ఏడుగంటలకా లేవటం? గట్టెక్కే కాపరాలేనా యివి? సంబడం. సంబడమాని! మరీ వయసు వచ్చే కొద్దీ పిచ్చి వికారాలు జాస్తవుతున్నాయి."

కాత్యాయని పలక్కుండా తనపని చూచుకుంటున్నది. సణిగి సణిగి వూరుకోలేదు ఆమె. కొడుకు భోజనానికి వచ్చి తిన్నంత సేపూ ఎదురుగా కూచుని లోకాభిరామాయణం విడేసింది. అతను ఆఫీసుకు వెళ్ళే వరకూ కోడలు పైకి వెళ్ళను సందుదొరకనివ్వలేదు. చివరకు వెళ్తున్న కొడుకుతో "ఆ సుబ్బారావురా. డబ్బు తీసుకుని ఏడాదయింది. అసలూ లేదు. వడ్డీ లేదు. సాయంత్రమొకసారి అటువెళ్ళి కనుక్కుని రా నాయినా. మర్చిపోకుండా." కొడుకు ఇంట్లో నుండి కదిలిన తర్వాత నిట్టూర్చి నిశ్చింతగా వూరుకున్నది.

శ్యామసుందర్రావుదదో తరహా. అతనికి కాత్యాయని మీద వల్లమాలిన ప్రేమాలేదు. ద్వేషమూ లేదు. పుట్టింది మొదలు తెల్సిన పిల్లే కావటంతో అతనికామెలో ప్రత్యేకత కనిపించదు. ఇల్లూ వాకిలీ. అమ్మానాయినా, ఆఫీసూలాగే కాత్యాయనీ ఒక అలవాటైన ప్రాణి. ఇంకా అనాలంటే ఒక నిత్యావసర వస్తువు. ఆమె అందమూ, తెలివీ, నాజూకూ చమత్కారము ఏవీ కొత్తగా. వింతగా కన్పించవు. అతని దృష్టిలో ఆమెకు ప్రత్యేకపు విలువేం లేదు. క్రమంగా పరిచయం పెరిగి. చనువు జాస్తయి, ఆమె అవసరం పెరిగి, అతని దృష్టిలో ఆమెకో విలువ ఏర్పడకుండా భ్రమరాంబ పెండ్లయినప్పట్నుంచీ యథాశక్తి శ్రమ పడుతూనే వున్నది పాపం. అది కాత్యాయని ఏనాడో గ్రహించింది. ఈ అత్తగారు హరీ మనందే ఈ కాపరం బాగుపడదు. రాయివంటి అత్త ఇప్పుడల్లా హరీమనదు.


మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సా
విరేపనముతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!

ఆ సాయంత్రం శ్యామసుందర్రా వింటికి రాలేదు. కాత్యాయనికి తెలుసు. అత్తగారతని కేదో డబ్బు కూడా యిచ్చే వుంటుందని.

"ఏమిటీ వీడింకా రాలేదూ. ఇంత పొద్దు పోయినా? నిన్న రాత్రేదో ఇంటి దగ్గరే వున్నాడు గదా. కాస్త దారికి వచ్చాడనుకున్నా. అంతలోనే అయిందీ? అసలు వాడ్ననట మెందుకూ? మన దగ్గరుండాలి తెలివి. ఆడది తెలివిగలదై, మొగుడ్ని అట్లా కుక్కపిల్లలా వెంట తిప్పుకోవాలి గాని. లేకుంటే ఇట్లాంటి పెడసరపు మగవాండ్లు దారికొస్తారా? అందులో వాడసలే షోకిల్లా."

అత్తగారి మొసలి కన్నీళ్ళకు కాత్యాయ



dCA/GL/51 E TEL

నికి వళ్ళు మండింది. "నీవేగా, సుబ్బారావో, దిబ్బారావో. వాడి దగ్గరకు వెళ్ళి రమ్మన్నావు?"

"అయితేమాత్రం ఇంత సేవ చే? డబ్బిచ్చాం. ఇన్నాళ్ళయింది. అంతులేదు. కాస్త కనుక్కుని రమ్మంటే అది సాకు బెట్టుకుని వీడిట్లా ....

* * *

రోజులు జరిగాయి. పెండ్లయిన పదేండ్లకు కాత్యాయని గర్భవతైంది. మనసులో పొంగి పోయిందామె. ఇప్పుడు తెలిసి వస్తుంది తన విలువ భర్తకు. ఈ యింటి కోడలు తను. అతని పిల్లలకు తల్లి. ఈ వంశం నిలపటం తనచేతుల్లోనేవున్నది. ఇంకా తనకు విలువ ఇవ్వడూ అతను?

గుమ్మడిపండు వంటి కొడుకును చూచి కాత్యాయని సముద్రంలాగా పొంగి పోయింది. "నీవురా బాబూ మీనాన్న మొగుడివి" బిడ్డ నెత్తుకొని అయిదో నెలలో అత్తగారింటి కొచ్చిన కాత్యాయని. విన వచ్చిన వార్తలకు విస్తుబోయింది. "ఏమిటత్తా యిది?" అని బావురుమంది. మామగారెటూ పలకలేదు.

అత్తగారుమాత్రం "ఏంచెయ్యమంటావే కాచమ్మా? పురుటిసాకు బెట్టుకుని. ఒక రోజా, రెండు రోజులా, పదినెల్లు పుట్టింట్లో మకాం చేస్తివి. వాడ సరే....సరే తెలియని మేళమా? కాకున్నా ఇన్నాళ్ళుంటారటే మొగుడ్నొదిలి పుట్టింట్లో?"

"నీవేగదత్తా నాన్నరాగానె ఐదోనెలలోనే పంపిందీ? ఆ తర్వాత మూఢమంటివి శూన్యం అంటివి. తొల్చూలు బిడ్డను పుట్టింటిలోనే కనాలంటివి"

"అన్నాననుకో తోబుట్టిన వాడొచ్చి పిల్లను పంపమంటే ఏమంటారే — నీకు తెలియవద్దూ?"

కాత్యాయని బొమ్మలా నిలబడి చూస్తూ అచ్చుగుద్దినట్టు తన ప్రతిబింబంలా వున్న కొడుకును చూసికూడా, శ్యామసుందర్రావు మనసు కరగలేదు. కాత్యాయని కలలు గన్నట్టు అతనిదృష్టిలో ఆమె విలువ పెరగనూలేదు. మూడేండ్లు మొండిగా వున్నదా యింటిలో. మరి ఫలితమేం లేదు. దాన్ని కావరమనేకంటే కణకణలాడే నిప్పులమీద నడవటమనటం సబబుగా వుంటుంది.

"ఎందుకే పిచ్చిదానా నీకింకా ఆశ చావలేదు. వాడింక మారనూ మారడు నీకింకీ కొంపలో సుఖములేదు పద పోదాం చెట్టు కాయ చెట్టుకు బరువా? నేనున్నన్నాళ్ళు నీకింత కూడూ, కుడ్డా యిస్తాను. తర్వాత నీ కొడుకే ఎక్కి వస్తాడు లే - ఏం చేస్తాం ఖర్మ?" తండ్రివచ్చి పిలిస్తే మూడేండ్ల కొడుకు నెత్తుకుని కన్నీళ్ళతో గంపెడు చీకటి నెత్తికెత్తుకుని బయలుదేరి పుట్టింటికి వెళ్ళింది కాత్యాయని.

* * *

ఇది జరిగి నిన్నా నేడా? ఇరవై రెండేళ్ళు. కాత్యాయని మున్సిపల్ గరల్స్ హైస్కూల్లో టీచరుగా పని చేస్తున్నది. కొడుకు పాతికేండ్లవాడైనాడు. సెంట్రల్ గవర్నమెంటులో నాలుగొందల యాభై రూపాయల జీతంలో మంచి ఉద్యోగమే అయిందతనికి. ఇక పెండ్లి చేస్తే తన బరువు తీరుతుందని కాత్యాయని ఆలోచిస్తున్న రోజుల్లో శ్యామసుందర్రావు ప్రత్యక్షమైనాడామెకు.

"మనిషని ఉన్నాక మంచీ చెడూ వుండకుండా వుంటాయా? ఏమిటో అవాక రోజులు. అన్నీ గడిచిపోయినాయి. తల్చుకుంటే నాకే సిగ్గుగా వున్నది. నిజంగా నా మనస్సు పశ్చాత్తాపంతో నిండిపోతున్నది కాత్యాయనీ. నీవూ, వాడూ కల్సి రాండి. అందరం కలిసే వుందాం. పోయినన్నాళ్ళూ జరిగేపోయినాయి. ఇకనెందుకీ చివరిరోజుల్లో కక్షలూ, కార్పణ్యాలూ? చెప్పు."

"మీరన్నదీ నిజమే. అసలు నాకేనాడూ మీ మీద కక్షలేదు. కార్పణ్యమూలేదు. మీరన్నట్టు ఇన్నాళ్ళూ జరిగే పోయినాయి ఇకనీ చివర్న ఎందుకీ కొత్తకాపరం? అనలతుకుతుందా? వుండగలమా?"

శ్యామసుందరరావు మొహం వాడిపోయింది. కాసేపాగాడు. "కొత్త కాపరమేమిటి" చిత్రం కాకుంటే? ఏదో పొరబాటు జరిగింది. తప్పు తెలుసుకుని దిద్దుకుందామని నేను వచ్చానంతే."

"అంతేలెండి కాని అది కుదరదు. అంటున్నాను."

"ఏం ఎందువల్ల? నీవు బయలుదేరిరా ఎందుక్కుదరదో చూద్దాం."

"నేను బయలుదేరిరాను. అందుకే కుదరదని చెబుతున్నాను."

"చేసిన తప్పుకు పశ్చాత్తాపమనేది వుండదా కాత్యాయనీ?"

"ఉంటుంది. కానీ మీ పశ్చాత్తాపం వల్ల నాకేం ఒరగదని చెప్తున్నాను." శ్యామసుందర్రావు మొహం ముడుచుకున్నాడు. "ఏదో ఆ వయసు పొంగులో, నిన్ను నిర్లక్ష్యం చేసి, తిరిగిన మాట నిజమే ననుకో. నీకు మాత్రం ఇది ధర్మమేనా? పశ్చాత్తాపంతో కుమిలిపోతున్న ఒక వ్యక్తిని అందులో భర్తను తృణీకరించటం ధర్మమే నంటావా? నీకూ, నా యిల్లూ, నా కుటుంబం అని, శాంతిగా వుండాలనిలేదూ మనసులో? జరిగినవన్నీ ఎందుకు తవ్వుకోవటం. భవిష్యత్తేమిటో చూడరాదా కాత్యాయనీ?"

"చూస్తున్నా. నాభవిష్యత్తు నా కొడుకూ, కోడలూ, పిల్లలూ, నా యిల్లు, కాపరమూ. కుటుంబమూ అంతా వాండ్లే యిక."

శ్యామసుందర్రావు తెచ్చిపెట్టుకున్న శాంతంపటాపంచలైంది. "అదేలే నీగర్వం. ఆ కొడుకుని చూచుకొని గర్వపడుతున్నావు కదూ?"

"నిజమే మరి. మొగుడ్నిచూచి గర్వించలేని ఆడది కొడుకును చూచుకుని పొంగిపోక ఏం చేస్తుంది చెప్పండిమరి?"

"ఇప్పుడింకా పసివాడు. పెండ్లయి భార్యతో కలిసి, నిన్ను ...."

"ఆపండాపండి. వాడంత తండ్రిపోలిక. ఆ ప్రమాదం రాదులెండి. కాదని మీ ఆశీర్వాద బలంవల్ల వాడుభార్యతో కల్సి నన్నెదిరించినా దిగుల్లేదు. ఒక అమాయకురాలు పెండ్లి నెపంతో మన ఇంటికి తన తల్లి తండ్రులను, తోడబుట్టినవాండ్లను పుట్టి పెరిగిన ఇంటిని వదలి వచ్చినప్పుడు. అది మన పిల్లగాదా? దాని భర్త దానితో అనుకూలంగావుంటే మన మేడవడమెందుకు? ఇకనదెందుకు వస్తున్నట్టు మన ఇంటికి? మీరే చెప్పండి?"

"మాటలు బాగా నేర్చావ్. నీబోటిదానికిక చెప్పేదేమున్నది. డబ్బు మదం బాగా తలకెక్కింది. అది దిగితేగాని...."

"ఆగండి. ఇప్పటికి నిజం మాట్లాడుతున్నారు మీరు. అసలు నిజం అదే. నేనెప్పుడో కనుక్కున్నాను. డబ్బు చండాలపు దంటారుగాని, దానివల్లనే మనిషికి ఆత్మస్థైర్యం. ధైర్యం, గుండె నిబ్బరం అన్నీ వస్తాయి. పరానికి బ్రహ్మవిద్యలాగే. ఇహానికి హేమ విద్య అవసరమన్నారు. అది అబద్ధం కాదని అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను మీదయవల్ల. కాదంటారా

ఉచితము! ఉచితము!
తెల్లమచ్చలు
అన్ని రకాల మచ్చలను, ఎటువంటి రంగువైనా మా ప్రఖ్యాత మందు అయిదు రోజులలో మాన్పును. త్వరలోనే చర్మము మామూలు రంగు పొందును. ప్రచార నిమిత్తము ఒక సీసా మందు ఉచితంగా పంపబడును. వెంటనే వ్రాయండి. వివరాలకు.
Bharat Ayurvedashram
P.O. Katri Sarai (Gaya)

చెప్పండి. కాదంటే మీరీనాడు నాదగ్గర కెందుకొచ్చారు? నన్ను రమ్మని ఎందుకు బతిమాలుతున్నారో చెప్పండి."

శ్యామసుందర్రావు కస్సుమన్నాడు. "డబ్బు చూచేంకాదు. మనిషి తను చేసిన తప్పులకెప్పుడో ఒకప్పుడు బాధ పడతాడు. పశ్చాత్తాపపడుతాడంతే. తెలుసా! నీ డబ్బు చూచి మురిసి వచ్చాననుకోకు."


"మరి నా అందాన్ని చూచా, వయసును చూచా, దేన్ని చూచి వచ్చారు? నేను ఇంత కన్న అందగత్తెగా వయసులోవుండి, మీ అడుగులకు మడుగులొత్తుతూ వున్నరో జుల్లో కుక్కలా చూచారు నన్ను. మూడేండ్ల పసివెధవను తీసుకొని వస్తుంటే కూడా మీ రాతిగుండె కరగలేదు. అంతే గాదు. ఇన్నాళ్ళ నుంచీ వున్నానో, చచ్చానో విచారించలేదు. ఆ నాడు నా అవసరం మీకులేదు. నా కష్టాలు మీ కక్కర్లేక పోయినాయి. ఇప్పుడు మీకు నేనెందుకు గుర్తొచ్చానో నాకు తెలియకపోలేదు. పాపం ముసలామె మంచాన పడింది. వున్న ఆస్తంతా మీ వ్యసనాలకు కరిగిపోయింది. వచ్చే పెన్షను తిండికే చాలదు. ఆ పిల్లలంతా చిన్న చిన్న వాండ్లు. అందువల్ల ఈ సంపాదనా పరులైన భార్యా కొడుకూ గుర్తుకు వచ్చారు. అంతేగాదూ? లేకుంటే మీ కింకో భార్య వున్నది పిల్లలూ వున్నారు. వయసూ చెల్లిపోయింది. ఇక ఇప్పుడెందుకు మీరు నాకీ ఆహ్వానం చెప్పండి మరి?"

శ్యామసుందర్రావు క్షణం నిరుత్తరుడైనాడు. కాత్యాయని ఇంత సూటిగా మాట్లాడుతుందనుకోలేదు, అయినా బింకంగా "సరే నీ ఇష్టం. నా వుద్దేశమేమిటో చెప్పాను? నీవంత పెడసరంగా మాట్లాడి, పెడర్థాలు తీస్తే ఇకనేం చేస్తాను? ఏం చెబుతాను?"

కాత్యాయని విసురుగా "ఏం చెప్పవద్దులెండి, చెప్పినా నేను వినను. వినదల్చుకోలేదు. పశ్చాత్తాపపడగానే ఏం లాభం? మీ పశ్చాత్తాపం వల్ల నాకేం సుఖం సంతోషం? వున్న ఆస్తంతా నాశనం చేశారు. నేననేదాన్ని గుర్తే రాలేదు మీకు. డబ్బుతో వయసులో అనుభవించదగిన సుఖాలన్నీ అనుభవించి ఇల్లూ వళ్ళూ గుల్ల చేసుకుని, మళ్ళీ పెండ్లి చేసుకుని, పిల్లల్ని కని, అంతా వుడిగి, ఈ నాడు ఎందుకు మీ పశ్చాత్తాపం నాకు? ఆ నాడు మొగుడ్ని వదిలి వచ్చినదానిలా నల్గురిలో చిత్రించారు నన్ను, ఈ నాడు మొగుడొచ్చి పిల్చినా, బతిమాలినా, తిరస్కరించినదానిలా చిత్రించాలనేగదూ మీరీ నాటక మాడటం? ఇప్పుడు చెప్పండి. ఆ నాటికీ. ఈ నాటికీ నాలో కనిపించే విలువ ఏమిటి మీ దృష్టిలో? డబ్బేగదూ? పైగా ధనమదం నా తలకెక్కిందంటున్నారా? ఆ మాట అనటానికి నోరెట్లా వచ్చిందిమీకు? నాకు ధన మదం తలకెక్కలేదు. మీకు డబ్బు అవసరమై నేను గుర్తొచ్చాను. వ్యర్థ పశ్చాత్తాపమూ, దొంగకన్నీళ్లు వస్తున్నాయి. లాభంలేదు. వీటితో నన్ను కరిగించలేరుమీరు. ఆనాటి కాత్యాయనినికాను నేను. ఆనాటి కాత్యాయని ఏనాడో చచ్చిపోయింది.

"ఇది నా పునర్జన్మ. అప్పుడునాకు డబ్బు లేదు. వుండే వుంటే మీరంత తృణీకరించి






వుండరేమో బహుశా కదూ? మిమ్మల్ని దేవుడిలా చూచాను. మీ దౌర్బల్యాన్నీ సహించాను. మీ వ్యసనాలన్నీ తెల్సికూడా సరిపెట్టుకున్నాను. అందువల్ల మీకేమైనా పశ్చాత్తాపం కలిగిందా? పాపం పుణ్యం అన్నారా? ఆఖరకు మీ రక్తం పంచుకొని పుట్టిన కొడుకు నేనాడన్నా దగ్గరకు పిల్చారా? ఎత్తుకున్నారా? వాడి చేతిలో ఒక్కచాక్లెట్టు కొనిపెట్టగలిగారా? సిగ్గు లేక ఈనాడే ముఖంతో వాడిని తండ్రినంటూ ఆహ్వానిస్తారు? ఏమిటి నా దగ్గర తప్పుచూశారు? ఎందులో లోపముందని వదిలేశారు? ఈనాడేముందని పరుగెత్తుకుని వచ్చి పిలుస్తున్నారు? నా విలువ డబ్బుతోనే ముడిపడి వుందని నాకు తెల్సు. అందువల్లనే ఇక మీరు నన్ను మభ్యపర్చలేరు - వెళ్ళండి. పోయిన సుఖమేదో పోనేపోయింది. ఇక నాకేం కావాలి గనుక! వాడి మెడకో తాడు వేసి, కృష్ణా రామా అనుకుంటే సరిపోదూ? ఈ వయసులో ఎందుకీ వెధవ బెడదలన్నీ? తగిలించుకున్నందుకు మీరే పడండి అవేవో.

"మీ పశ్చాత్తాపాలూ ప్రాయశ్చిత్తాలూ నా కొద్దు. మీ మంచీ చెడ్డా వద్దు. మన మిద్దరం కలిసి నడుద్దామని బయలుదేరాం. నా దార్న నన్ను వదిలేసి, మీ దార్న మీరు నడిచేరు. నాకు నచ్చిన, చాతైన దారి నేననుసరించాను. బహుదూరం నడిచి, అనేక బంధాలు నాకు తగిలించుకొని ఇంచుమించు ఒకర్నొకరం మర్చిపొయ్యే ఈ తరుణంలో మళ్ళీ కల్సి నడవడం సాధ్యమేనంటారా?"

శ్యామసుందర్రావు బ్రహ్మాస్త్రం ప్రయోగించాడు ఆఖరుసారిగా "సీతా, సావిత్రీ జన్మించిన దేశంలో...."

"నేనెట్లా పుట్టాననేగా మీ సందేహం? చెబుతా వినండి. సీతా, సావిత్రికి నిర్వచనం మీరనేది కాదు. మీరు వూహించేదికాదు. తాను వలచిన వాడికోసం యముడ్ని ఎదిరించింది సావిత్రి. ఏకపత్నీవ్రతుడని పేరు పొందిన రాముడే రెండవసారి శీల పరీక్ష కోరితే అభిమానంతో భూమిలోకి వెళ్ళిపోయిందిసీత. ప్రతిమగవాడూ తనభార్యకు సీతనూ, సావిత్రినీ ఆదర్శంగాచూపుతాడు. శీలం విషయంలో నేనేనాడు ఆ యిద్దరికి తీసిపోను. మరి మీరు రామచంద్రుడూ, సత్యవంతుడూ అవుతారా? ఎందుకీ ధర్మపన్నాలు, మీరు ఆచరించలేనివి అందరికీ బోధిస్తారు? వెళ్ళి మీ సంసారం మీరు ఈదుకోండి.నాబతుకేదో నేను చూచుకుంటాను."

"అంతేనా కాత్యాయని?"

"అంతే. అంతే. ముమ్మాటికీ అంతే."

శ్యామసుందర్రావు లేచి నిల్చున్నాడు. "సరే వెళ్తాను. నీవు నా మాటలు నమ్మటం లేదు. నా విలువ నీకీనాడు తెలియదు."

"ఈనాడేకాదు.ఏనాడూ ఈ భారతభూమిలోనేగాదు. ఎక్కడైనా ఆడదానికి మగవాడి విలువ ఎప్పుడూ తెలుసు. అందుకే ఆడది 'తన' అనేమగవాడుకొట్టినా కోసినా నోరెత్తకుండా భరిస్తుంది. ఇంక మగవాడికే ఆడదాని విలువ తెలియంది. తాను మగవాడిననే అహం తప్ప వాడికికనేమీ తెలియదు, నిజం చెప్పాలంటే ఆడదిలేనిదే క్షణం బతకలేని దౌర్భాగ్యుడు మగవాడు. నన్ను కాదన్నారు సరే, మీరు మళ్ళీ పెండ్లి చేసుకున్నారు. లేనిదే జీవితం గడవదా? మీకన్నా చిన్నదాన్ని నేను. నాకు చదువులేదు, వుద్యోగం లేదు. ఆస్తిపాస్తుల్లేవు. అయినా ఆ పసివాడి కోసం బతికాను కష్టపడి. ఆ వయసులో, ఆ మానసిక చింతలో కూడా చదివాను. వుద్యోగం సంపాదించేను. ఇదంతా ఎవరి కోసం? మీ కొడుకొక్కసం. కాకుంటే నా ఒక్క పొట్టకు ఎవరింట్లో పనిదానిగా కుదిర్నా. నాలుగిండ్లు పాచిపని చేసుకున్నా నిండదూ? ఆ పసివాడి విలువ గడ్డిపరక్కంటే హీనం మీ దృష్టిలో. వాడే మేరుపర్వతం నా కండ్లకు. నాబతుక్కంతా వాడే ఆలంబన. ఇప్పుడు చెప్పండి. విలువ తెలియనిదెవరికో. మీకే గదూ! ఆడది కూటికీ గుడ్డకూ తన మీద ఆధారపడుతున్నదనేగా మగవాడికా అహం? దానికోసం ఆ ప్రాణి అస్థిచర్మం. ధారపోస్తున్నదనీ, మీ కోసం. మీ సంతానం కోసం తనదీ అని ఏమీ లేకుండా బతుకంతా త్యాగం చేస్తున్నదనీ తెలుసా మీకు. నాల్గురాళ్ళు సంపాదిస్తున్నారనేగా మీ అహం? ఏనాడు మీకు ఆడదాని విలువ తెలుస్తుందో, అది ఆటబొమ్మ కాదని తెలుసుకుంటారో చెప్పండి. మీరు వద్దన్నప్పుడు వెళ్ళిపోయి, రమ్మన్నప్పుడు బొమ్మలాగా రావటానికి నాకూ మనసూ, అభిమానమూ వున్నాయి, నేనేం యంత్రాన్నిగాను- మీలాగా రక్తమాంసాలున్న మనిషినే గదా. నాకు మాత్రం విలువ ఏమీ లేదంటారా లోకంలో?" ★

**తెల్ల వెంట్రుకలు ఆపండి**

హెయిర్ డై వలన కాదు, మా ఆయుర్వేదిక్ పుష్పమాల హెయిర్ ఆయిల్ తెల్ల వెంట్రుకలను శాశ్వతంగా నలుపుగా మార్చును. మెదడుతో పనిచేయు ప్రతి ఒక్కరికి మంచిది.

ఒక సీసా ధర రు. 11/–ఒక కోర్సు 3 సీసాలు–రు. 30/– పోస్టేజి అదనం.

MODI CHIKITSALAYA (S.D.V)
P. O KATRI SARAI (GAYA)